

ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-కడప అర్బన్

పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు పూర్తికాకుండానే 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి ముందస్తు ప్రవేశాలు చేపట్టిన ప్రయివేట్ జూనియర్ కళాశాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇంటర్మీడియట్ బోర్డ్ కార్యదర్శి సౌరబ్ గౌర్ హెచ్చరించినట్లు ఆర్ఐఒ బండి వెంకటసుబ్బయ్య ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ విద్యా మండలి 2024-25 సంవత్సరానికి అడ్మిషన్ షెడ్యూల్ను త్వరలో ప్రకటిస్తుందని, దాని ప్రకారమే చేర్చుకోవాలని పేర్కొన్నారు. అడ్మిషన్ నోటిఫికేషన్ కంటే ముందే ప్రవేశాలు తీసుకున్నట్టు ఫిర్యాదులు అందితే జూనియర్ కళాశాల గుర్తింపు రద్దుకు సిఫారసు చేస్తామని తెలిపారు.

టిడిపి ఎంపీ అభ్యర్థిత్వాలపై పీఠముడి

- పొత్తు పేరుతో స్పష్టత ఇవ్వని చంద్రబాబు
- రాజంపేట తెరపైకి మాజీ ముఖ్యమంత్రి కిరణ్?
- కడప పార్లమెంట్లో మరోసారి ఐవిఆర్ఎస్ సర్వే
- ఆశావహుల ఊగిసలాట.. కేడర్లో గందరగోళం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని టిడిపి పార్లమెంట్ అభ్యర్థిత్వాలపై పీఠముడి పడింది. ఉమ్మడి కడప జిల్లాలో కడప, రాజంపేట పార్లమెంట్ అభ్యర్థిత్వాలపై టిడిపి సుదీర్ఘ కసరత్తు చేస్తోంది. తొలుత ప్రకటించిన అభ్యర్థిత్వాలను కాదని మరోసారి ఐవిఆర్ఎస్ సర్వేలు చేయిస్తోంది. వైఎస్ జగన్ తన సొంత జిల్లాలోని కడప, అన్నమయ్య పార్లమెంట్ స్థానాలకు ప్రకటించిన అభ్యర్థులకు ధీటైన అభ్యర్థులను ఖరారు చేయడంపై మరోసారి పరిశీలన చేస్తోంది. బిజెపితో కుదిరిన పొత్తు నేపథ్యంలో భాగంగా బిజెపి కేడర్లో ధీటైన అభ్యర్థులెవరైనా ఉన్నారా అనే కోణంలో పరిశీలిస్తోంది. తొలుత రాజంపేట పార్లమెంట్ స్థానానికి సుగవాసి బాలసుబ్రమణ్యం పేరును అనధికారికంగా ప్రకటించింది. రాయచోటి అసెంబ్లీ టికెట్కు పరిష్కారాన్ని కొనుగొంది. బిజెపితో పొత్తు కొలిక్కి రావడంతో బెడిసికొట్టింది. రాజంపేట పార్లమెంట్, అసెంబ్లీ టికెట్లపై అనిశ్చితి నెలకొంది.

రాజంపేట బరిలో బిజెపి?

రాజంపేట పార్లమెంట్ను బిజెపికి వదిలేయడంపై మీనమేషాలు లెక్కిస్తోంది. 2014లో రాజంపేట బరిలో ప్రస్తుత బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురంధేశ్వరి పోటీ చేసిన నేపథ్యాన్ని గుర్తు చేస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి అభ్యర్థిని బరిలో నిలిపేలా పావులు కదుపుతోంది. బిజెపి తరుపున పీలేరుకు చెందిన మాజీ ముఖ్య మంత్రి కిరణ్కుమార్రెడ్డి పేరును తెరపైకి వచ్చింది. ఈయన స్థానికులు, మాజీ ముఖ్యమంత్రి, రాజకీయ, ఆర్థిక, సామాజిక, అంగ బలాలు కలిగిన నాయకుడు కావడం, అధికార వైసిపి నాయకులతో బంధుత్వాలను కలిగి ఉండడం వంటి వంటి కారణాల రీత్యా ధీటైన అభ్యర్థిగా భావించినట్లు తెలుస్తోంది. రాజంపేట పార్లమెంట్ అభ్యర్థిగా బరిలో నిలిపే ఆలోచన ఆదరణలో పెట్టే ఆలోచన సాగిస్తోంది. దీనిపై మాజీ ముఖ్యమంత్రి కుటుంబం నుంచి ఎటువంటి వ్యతిరేకత రాకపోవడంతో ఊహాగానాలకు బలం చేకూరినట్లు అవుతోంది.

రాయచోటి అసెంబ్లీలో అనిశ్చితి..

రాజంపేట టిడిపి పార్లమెంట్ అభ్యర్థిగా ఎస్.బాలసుబ్రమణ్యం పేరును తప్పించడంతో రాయచోటి టిడిపి అసెంబ్లీ అభ్యర్థికి కష్టాలు తప్పవని తెలుస్తోంది. పార్లమెంట్ పరిధిలోని 14,02,808 ఓటర్లలో బలిజ సామాజికవర్గానికి చెందిన ఓట్లు గణనీయమైన సంఖ్యలో ఉన్నాయి. రాయచోటి అసెంబ్లీ పరిధిలోని బలిజ ఓటర్లలో భారీగా చీలిక రానున్నట్లు తెలుస్తోంది. ఇది ప్రత్యర్థి లాభించే అవకాశం ఉంది. టిడిపి అభ్యర్థి రాంప్రసాద్రెడ్డి రాజకీయ కుటుంబానికి చెందిన నాయకుడు, యువకుడు కావడంతో ఆర్ఈ, సుగవాసి కుటుంబాలకు రాజకీయ అభద్రత ఏర్పడింది. రాంప్రసాద్రెడ్డి గెలిపిస్తే తమ రాజకీయ జీవితాలపై తీవ్ర ప్రభావం పడనుందనే ఆందోళన నెలకొంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో రాయచోటి టిడిపి అభ్యర్థి గెలుపును సందిగ్ధంలో పడేసినట్లు అవుతోందనే వాదన వినిపిస్తోంది.

మిథున్రెడ్డి ఎన్నికల ప్రచారం లేనట్లే!

వైసిపి రాజంపేట పార్లమెంట్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్రెడ్డి పేరును ప్రకటించింది. తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలో జనసేన అధ్యక్షులు పవన్కళ్యాణ్ పోటీ చేస్తున్న నేపథ్యం తెలిసిందే. పవన్ను ఓడించాలనే లక్ష్యంతో మిథున్రెడ్డిని వైసిపి అధిష్టానం పిఠాపురం ఇన్ఛార్జిగా నియమించింది. ఆయన రాజంపేట పార్లమెంట్ బరిలో ఎన్నికల ప్రచారానికి హాజరయ్యే అవకాశాలు తక్కువగా ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో రాజంపేట పార్లమెంట్ బరిలో నుంచి ఎస్.బాల సుబ్రమణ్యం పేరును తప్పించడం చర్చనీయాంశంగా మారింది.

కడప పార్లమెంట్లోనూ గందరగోళమే

కడప పార్లమెంట్ అభ్యర్థి ఎంపికలో గందరగోళం నెలకొంది. పార్లమెంట్ అధ్యక్షులు ఆర్.శ్రీనివాసరెడ్డిని కాదని, మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి పేరుపై ఐవిఆర్ఎస్ సర్వే చేయడం విమర్శలకు ఆస్కారాన్ని కల్పించింది. వీరిలో రాజకీయ, ఆర్థిక, సామాజిక, అంగ బలాలు కలిగిన వారిలో ఆర్.శ్రీనివాసరెడ్డి ముందంజలో ఉన్న సంగతి తెలిసిందే. కానీ టిడిపి అధినాయకత్వం డోలాయమానంలో పడింది. ఇంతలో ఇటీవల వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్ ధైర్యంగా సిట్టింగ్ ఎంపీ వైఎస్ అవినాష్రెడ్డి పేరు ప్రకటించారు. కానీ ప్రతిపక్ష టిడిపి పార్లమెంట్ స్థానానికి అభ్యర్థి కోసం వెంపర్లాడుతుండడం బలహీనతను గుర్తు చేస్తోంది. వైసిపి ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్రెడ్డి రాష్ట్రంలోని ఇతర ఎంపీలెవరూ ఎదుర్కోనన్ని విమర్శలు ఎదుర్కొంటున్నప్పటికీ, టిడిపి అభ్యర్థి కోసం వెంపర్లాడుతుండడం గమనార్హం. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రతిపక్ష టిడిపి జిల్లాలోని పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసుకోలేని దుస్థితిని ఎదుర్కొంటు న్న నేపథ్యంలో ఆశావహులను, కేడర్ను ఆందోళనకు గురి చేస్తోంద నడంలో సందేహం లేదు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

- 'నిజం గెలవాలి'లో నారా భువనేశ్వరి



రాయచోటి : బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న భువనేశ్వరి

ప్రజాశక్తి-గాలివీడు

అధైర్య పడవద్దు, అన్నివేళలా అండగా మీకు మేమున్నామని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి పేర్కొన్నారు బుధవారం మండలంలో ఆమెకు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీ ఎత్తున చేరుకొని స్వాగతం పలికారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా ఎగవ గొట్టివీడు గ్రామంలో నాగన్నగుట్ట పాలెంకు చెందిన సర్పంచ్ ప్రభాకర్ నాయుడు కుటుంబాన్ని పరామర్శించారు. చంద్రబాబు అరెస్టుని జీర్ణించుకోలేక గుండెపోటుతో ప్రభాకర్నాయుడు సతీమణి రెడ్డమ్మ మరణించారు. రెడ్డమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ అన్యాయాన్ని ఎదుర్కొని నిజాన్ని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ ఎల్లవేళలా మీ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా కల్పించారు. సిఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి పాలనపై విరుచుకుపడ్డారు. గత ఐదేళ్ల పాలనలో తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలతో పాటు ప్రజలు అనేక రకాల సమస్యలను ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. కక్ష సాధింపు చర్యలతోనే అనేక మందిని అక్రమ అరెస్టులకు గురిచేసి మానసిక క్షోభకు గురిచేశారన్నారు. రానున్న రెండు నెలల్లో ప్రతి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరూ ధైర్యంగా నిలబడి నిర్భయంగా ఓటు వేసి వేయించి తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు సిఎం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. తాను కూడా రాయలసీమ పౌరుషం కలిగిన బిడ్డనని ఎటువంటి భయాలకు భయపడే ప్రసక్తే లేదని తెలిపారు. వైసిపి అరాచకాలను ప్రజలలోకి తీసుకువెళ్లి తెలుగుదేశం పార్టీని గెలిపించేందుకు మీ అందరి కృషితో ముందుకు వెళతానని స్పష్టం చేశారు. చంద్రబాబు నాయుడు ప్రజలకు మేలు చేసే వ్యక్తి గాని కీడు చేసే వ్యక్తి కాదని, జగన్మోహన్రెడ్డి కక్ష సాధింపుతోనే అక్రమ అరెస్టులు చేసినప్పటికీ తప్పు చేసినట్లు నిరూపించలేకపోయారని విమర్శించారు. **రాయచోటి :** స్థానిక రింగ్ రోడ్డులో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్రెడ్డి, టిడిపి పొలిట్బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, టిడిపి పార్లమెంట్ అభ్యర్థి సుగువాసి బాలసుబ్రమణ్యం, రాజంపేట టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు, రాయచోటి అసెంబ్లీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్రెడ్డి ఘన స్వాగతం పలికారు. అనంతరం పట్టణంలోని రాజుల కాలనీలో మృతి చెందిన టిడిపి కార్యకర్త ఎం.రవీంద్రరాజు కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించారు. **పీలేరు:** పీలేరులో పోలీసులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించి మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి కాన్వాయ్లోని ఐదవ వాహనాన్ని అడ్డుకున్నారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గంలోని గాలివీడుకు వెళుతున్న భువనేశ్వరికి పీలేరులో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె అందరికీ అభి వాదం చేస్తూ, ఆప్యాయంగా పలకరించారు. అనంతరం పీలేరు నుంచి గాలివీడుకు బయలుదేరిన కాన్వాయ్లో భువనేశ్వరి పిఎ ప్రయాణం చేస్తున్న వాహనాన్ని పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు, టిడిపి శ్రేణుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. సుమారు అరగంట మేరకు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా పోలీసులు మీడియా వాహనాన్ని సైతం అడ్డుకోవడంతో మీడియా ప్రతినిధులు, ఇతర వాహనదారులు తమ అసహనాన్ని వ్యక్తం చేశారు. భువనేశ్వరికి స్వాగతం పలికిన వారిలో నల్లారి కిషోర్ కుమార్రెడ్డితో పాటు తిమ్మాపురం రఘునాథరెడ్డి, వారణాసి శ్రీకాంత్రెడ్డి, కోటపల్లి బాబురెడ్డి పాల్గొన్నారు. **కలకడ:** భువనేశ్వరికి మండల కేంద్రమైన కలకడలో ఘన స్వాగతం పలికారు. తెలుగు తమ్ముళ్లు బాణసంచా పేలిచే ఆమెకు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. స్వాగతం పలికిన వారిలో కిషోర్ కుమార్రెడ్డి, ఎమ్మెల్సీ అనురాధ, మండల పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ నాయుడు, సర్పంచులు గుర్రం శివ, వెంకటరమణ, విశ్వనాథ నాయుడు, లక్ష్మి ప్రసన్న కుమారి, మండల నాయకులు మద్దిపట్ల సూర్య ప్రకాష్ నాయుడు, మల్లారపు రవి ప్రకాష్ నాయుడు, బరకం శ్రీనివాసులురెడ్డి, మాజీ జడ్పిటిసి తిరుపతి నాయుడు, దగ్గుపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సిద్ధం సభను జయప్రదం చేయండి : పెద్దిరెడ్డి

ప్రజాశక్తి - కడప

ఈ నెల 27వ తేదీన ప్రొద్దుటూరులో నిర్వహించే సిద్ధం సభను జయప్రదం చేయాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. బుధ వారం స్థానిక ఆదిత్య కల్యాణ మండపంలో నిర్వహించిన సమన్వయ సమా వేశంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎమ్మెల్సీలు, నియోజకవర్గ సమన్వయకర్తలకు పెద్దిరెడ్డి దిశా నిర్దేశం చేశారు. సిద్ధం సభకు సంబంధించి పోస్టర్లను మంత్రి పెద్దిరెడ్డి, ఉప ముఖ్యమంత్రి అంజాద్బాషా, వైసిపి జిల్లా అధ్యక్షులు సురేష్ బాబు, ఎంపీ అవినాష్రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్ 27 నుండి మేమంతా సిద్ధం సభ నిర్వహిస్తారన్నారు. గతంలో నాలుగు ప్రాంతాల్లో సిద్ధం సభలు జరిగాయన్నారు. సమావేశంలో ముఖ్యమంత్రి టూర్ కో-ఆర్డినేటర్ తలశిల రఘురాం పాల్గొన్నారు.

రవీంద్రనాథ్రెడ్డికి సన్మానం

ప్రజాశక్తి-కడప : కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్రెడ్డిని బుధవారం ఆయన నివాసంలో జిల్లా వైసిపి యువజన జిల్లా కార్యదర్శి పస్తం అంజి ఆధ్వర్యంలో నా యకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలి యజేశారు. అత్యధిక మెజారిటీతో తిరిగి ఎమ్మెల్యే అభ్యర్థిగా తప్పకుండా గెలు స్తారని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు యాసిన్ బాషా, రాము డు, తులసికుమార్, ఆంజనేయులు, మంతయ్య, వెంకటేష్, బాలు పాల్గొన్నారు.

వైవీయూ పరిశోధన విద్యార్థికి రూ.30 లక్షల ఫెలోషిప్

ప్రజాశక్తి-కడప అర్బన్ : యోగి వేమన విశ్వ విద్యాలయం, జియాలజి శాఖ డీఎస్టీ ఇన్స్పైర్ ఫెలో పరిధిలో పిహెచ్డి పూర్తిచేసిన డాక్టర్ బాదపల్లి ప్రదీప్ కుమార్కి భారత ప్రభుత్వ డిపార్ట్మెంట్ అఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ-సైన్స్ అండ్ ఇంజినీరింగ్ బోర్డు నేషనల్ ఫెలోషిప్ కింద పరిశోధన కోసం రూ.30 లక్షల ఫెలోషిప్ మంజూరు చేశారు. క్లైమేట్ చేంజ్ ఇంపాక్ట్ ఆన్ ల్యాండ్ డీగ్రేడషన్ అనే అంశం మీద పరిశోధనలు చేయడం కోసం నేషనల్ జిఓఫీసికాల్ రీసెర్చ్ ఇన్ స్టిట్యూట్ సిఎస్ఐఆర్ శాస్త్రవేత్త డాక్టర్ సక్రం మార్గదర్శనంలో ఈ పరిశోధనలు చేయ బోతున్నారు. విశ్వవిద్యాలయంలో ఆచార్య కె.రఘుబాబు మార్గదర్శకంలో ప్రదీప్ కుమార్ ఇదివరకే పిహెచ్డి పూర్తి చేశారు. ఈ సందర్భంగా విసి ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ వై.పి.వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ ఆచార్య రఘునాథరెడ్డి, డీన్ ఫాకల్టీ అఫ్ సైన్సెస్ ఆచార్య. కృష్ణారెడ్డి, జియాలజి అధ్యాపక బృందం ప్రదీప్ కుమార్ను అభినందించారు.

కురుబ మహేష్కు వైవీయూ డాక్టరేట్

ప్రజాశక్తి - కడప అర్బన్

వైవీయూ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ స్కాలర్ కురుబ మహేష్ కు వైవీయూ డాక్టరేట్ను ప్రకటించింది. పిఎస్ అండ్ పిఎ శాఖ ఆచార్య జి.పార్వతీ పర్యవేక్షణలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ఇన్ రూరల్ ఆంధ్రప్రదేశ్-ఆపర్చునిటీస్ అండ్ ఛాలెంజెస్-ఏ స్టడీ ఆఫ్ సెలెక్టెడ్ గ్రామపంచాయతీ ఇన్ అనంతపురం డిస్టిక్ అనే అంశం పై పరిశోధన చేసి రూపొందించిన సిద్ధాంత గ్రంధాన్ని మహేష్ విశ్వవిద్యాలయ పరీక్షలు విభాగానికి సమర్పించారు. విసి ఆచార్యులు చింతా సుధాకర్ మార్గదర్శకంలో నియమితులైన నిపుణుల బందం మహేష్ రూపొందించిన పరిశోధన గ్రంథం అధ్యయనం చేసి డాక్టరేట్కు అర్హత ఉందంటూ ధృవీకరించారు. ఈ మేరకు కురుబ మహేష్ కు డాక్టర్ ప్రొసీడింగ్స్ను వైవీయూ పరీక్ష నిర్వహణ అధికారి డాక్టర్ నల్లపురెడ్డి ఈశ్వర్ రెడ్డి జారీ చేశారు. ఈ సందర్భంగా పరిశోధకుని విసి, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ ఎస్.రఘునాథ్రెడ్డి, రాజనీతి శాస్త్రం ప్రభుత్వ పాలన శాస్త్రం సహా ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధనక విద్యార్థులు అభినందించారు.


ఐటిఐలో క్యాంపస్ డ్రైవ్

ప్రజాశక్తి - కడప అర్బన్ : ప్రభుత్వ ఐటిఐలో ఈ నెల 23న క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎడి రత్నరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జెవై సాఫ్ట్వేర్ సొల్యూషన్స్, టెక్ మహేంద్ర కంపెనీ వారు డ్రైవ్ నిర్వహిస్తున్నారని తెలిపారు. ఉదయం 10 గంటలకు హాజరు కావాలని పేర్కొన్నారు. ఐటిఐ, ఇంటర్, డిగ్రీ చదివిన వారు హాజరు కావాలని తెలిపారు.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు వేగవంతం చేయాలి : ఇఒ

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి ఆలయంలో ఏప్రిల్ 16న అంకురార్పణ, ఏప్రిల్ 17న శ్రీరామనవమి పర్వదిన ధ్వజారోహణంతో ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని టిటిడి ఇఒ ఎవి.ధర్మారెడ్డి అధికా రులను ఆదేశించారు. బ్రహ్మో త్సవాల ఏర్పాట్లపై బుధవారం తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనంలోని సమావేశ మంది రంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఏప్రిల్ 22న జరుగనున్న శ్రీసీతారాముల కల్యాణం ఏర్పాట్లను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కల్యాణం రోజున వచ్చే వేలాది మంది భక్తులకు అవసరమైన అన్నప్రసాదం, తాగునీరు, మజ్జిగ అందించేందుకు చక్కటి ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని విభాగాలు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకుని కల్యాణం రోజున భక్తులకు అందాల్సిన సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఎండ వేడిమి నుంచి ఉపశమనం కల్పించేందుకు భక్తులు నడిచే ప్రాంతాల్లో కూల్ పెయింట్ వేయాలని, అవసరమైన చోట్ల చలువపందిళ్లు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఊరేగింపు నిర్వహించే వాహనాలు, రథానికి సంబంధించిన పటిష్టతను పరిశీలించి ఫిట్నెస్ సర్టిఫికేట్ తీసుకోవాలన్నారు. సీతారాముల తలంబ్రాల ప్యాకింగ్కు 300 మంది, కల్యాణం రోజున భక్తులకు అన్నప్రసాదాలు, తలంబ్రాల పంపిణీకి దాదాపు 2 వేల మంది శ్రీవారి సేవకులను సిద్ధం చేసుకోవాలన్నారు. అత్యవసర వైద్య పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు వీలుగా అంబులెన్సులు సిద్ధంగా ఉంచుకో వాలని, ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటుచేసి తగినన్ని ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలని వైద్య అధికారులకు సూచించారు. సాంస్క ృతిక, సంగీత కార్యక్రమాలకు సంబంధించిన ప్రణాళిక త్వరితగతిన సిద్ధం చేయాలన్నారు. కల్యాణం రోజున భక్తుల రవాణా, వసతి, పార్కింగ్ కల్పించేందుకు ఆర్టిసి అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు పూర్తి సన్నద్ధంగా ఉండి వైఎస్ఆర్ జిల్లాలోని ఆయా విభాగాల అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. సమావేశంలో జెఇఒ వీరబ్రహ్మం, సివిఎస్ఒ నరసింహ కిషోర్, ఎస్విబిసి సిఇఒ షణ్ముఖ కుమార్, సిఇ నాగేశ్వరరావు, ఎస్ఇలు జగదీశ్వర్రెడ్డి, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, ఎస్టేట్ ఆఫీసర్ గుణభూషణరెడ్డి, డెప్యూటీ ఇఒలు నటేష్ బాబు, ప్రశాంతి, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టిటిడి ఇఒ ధర్మారెడ్డి

వైసిపి యుద్ధానికి టిడిపి సంసిద్ధం

- పొలిట్బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

వైసిపి ఎన్నికల యుద్ధానికి టిడిపి సంసిద్ధమని టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, నియో జకవర్గ అభ్యర్థి మాధవి పేర్కొ న్నారు. బుధవారం ద్వారకా నగర్లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైసిపి నాయకులు 10 వాహనాల్లో ప్రచారానికి వెళ్తున్నా ఎన్నికల కోడ్ లేదని, టిడిపి నాయకులకు మాత్రం ఓట్లు అడిగేందుకు ఎన్నికల నిబంధనలా అని ప్రశ్నించారు. సిఎం జగన్మోహన్రెడ్డి సొంత జిల్లాకు అన్యాయం చేశారని, కడప వాసిగా డిప్యూటీ సిఎం నీటి సమస్యను తీర్చలేకపోయారని తెలిపారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమ న్నారు. మసీదు నుంచి బయటికి వచ్చిన యువకున్ని బ్లేడుతో గాయపరిస్తే, ఆసుపత్రిలో ఉన్న యువకున్ని దాడికి ప్రోత్సహించిన వారే పరామర్శిం చడం ఎంతటి నయవంచనన్నారు. నీటి సమస్య మరింత జటిలంగా మారనుందని, కలెక్టర్, కార్పొరేషన్ కమిషనర్ నివారించాలన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి, మాధవి

ఎన్నికల నియమావళి పాటించండి

ప్రజాశక్తి-కాశినాయన

గ్రామాలలో ఎన్నికల నియమావళి పాటించాలని ఎంపిడిఒ మధుసూదన్రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఉపాధి హామీ సభా భవ నంలో మండలంలోని పంచాయతీ సెక్రటరీలు ఇతర సిబ్బందితో సమా వేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన తహశీల్దార్ కృష్ణ, ఎస్ఐ అమర్నాథ్రెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో మీరు ఎక్కడ కూడా రాజకీయ నాయకులకు తలొగ్గొద్దని తెలిపారు. ఎన్నికల నిబంధన ప్రకారం ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకే మనం పనిచేయాల్సి ఉంటుందని చెప్పారు. ఎన్నికల నియమావళిలో ఎవరైనా ఎంతటి వారైనా నిబంధనలు అతిక్రమిస్తే తప్పక తగు చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతి సెక్రటరీలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పట్టదా? : కాంగ్రెస్

ప్రజాశక్తి-కడప

వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి ఎక్కువగా ఉందని, దీని గురించి పాలకపక్షం గాని ప్రతిపక్షం గాని పట్టించుకోవడంలేదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపా ధ్యక్షులు బండి జకరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎ.సత్తార్ విమర్శించారు. బుధవారం డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో తీవ్ర మంచినీటి సమస్య ఏర్పడిందన్నారు. ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. నీటి ఎద్దడికి ప్రధాన కారణం వైసిపి, టిడిపి ప్రభుత్వ పాలనాలలో ఇసుక దోపిడీయే కారణం వల్ల భూగర్భజలాలు అడుగంటిపోయాయని పేర్కొన్నారు. అవినీతికి తావివ్వ కుండా మంచినీటి ఎద్దడిని నివారించాలని డిమాండ్ చేశారు. లేకుంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు కదిరి ప్రసాద్, ఖాన్, మైనార్టీ సెల్ అధ్యక్షులు ఆసిఫ్ ఖాన్, సూర్యుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బండి జకరయ్య

26న జడ్పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా ప్రజా పరిషత్ కడప ఉమ్మడి జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 26న నిర్వహిస్తున్నట్లు సిఇఒ సుధాకర్రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు.

సిఎఎ రద్దయ్యే వరకూ పోరాడుతాం

ప్రజాశక్తి - కడప అర్బన్

సిఎఎ రద్దయ్యే వరకు పోరాడుతామని ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా కార్యదర్శి గంగులయ్య అన్నారు. మంగళవారం ఓంశాంతి నగరలో ఉన్న పార్టీ కార్యాలయంలో మీడియాంతో మాట్లాడారు. పౌరసత్వాన్ని మతపరమైన గుర్తింపుతో ముడిపెట్టడం సరికాదన్నారు. బిజెపి ఎన్నికల్లో ప్రయోజనం కోసమే సిఎఎ ప్రజలకు ముందుకు తెచ్చిందని విమర్శించారు. సమావేశంలో కమిటీ సభ్యులు శ్రీను, వినోద్ పాల్గొన్నారు.

టిడిపి నగర ఉపాధ్యక్షుడిగా మన్సూర్

ప్రజాశక్తి-కడప అర్బన్

టిడిపి రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు జిల్లాలో పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి నూతన జిల్లా, నగర కమిటీ నియామకం చేపట్టారు. బుధవారం నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. నగర ఉపాధ్యక్షుడిగా పఠాన్ మన్సూర్ అలీఖానను నియమించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా కత్తి రవీంద్ర, గంగవరం రాజశేఖర్, జయరాం, కార్యదర్శిగా పోలిరెడ్డి, నగర కోశాధికారిగా పరిటాల వెంకట రమణయ్య, ఉపాధ్యక్షులుగా పఠాన్ మన్సూర్ అలీ ఖాన్, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులుగా వెంకట సుబ్బయ్య, నగర కార్య నిర్వాహక కార్యదర్శిగా గంపా వీరయ్య, కడప పార్లమెంటు కార్యదర్శిగా ఎం.శ్రీధర్, అధికార ప్రతినిధిగా డాక్టర్ జిలాని బాషను నియమించినట్లు తెలిపారు.



అలీఖాన్ను సన్మానిస్తున్న శ్రీనివాసరెడ్డి

చెరువు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-బద్వేలు

మున్సిపాలిటీ పరిధిలోని భాకరాపేట చెరువు ఆక్రమించిన వారిపైన వారం రోజుల లోపు చర్యలు తీసుకొని చెరువు చుట్టూ ఫినిషింగ్ ఏర్పాటు చేయ కపోతే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఇరిగేషన్ కార్యాలయం ఎదుట నిరవధిక నిరాహార దీక్షలు చేపడుతామని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని తెలి పారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన సమా వేశంలో ఆయన మాట్లాడుతూ భాకరాపేట చెరువు కబ్జాకు గురైందని చెరువును కాపాడాలని చెరువును ఆక్రమించిన వారిపై చట్టపరమైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికా రులకు ఫిర్యాదులు చేసినా, ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా ఫలితం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భాకరాపేట చెరువును భూకాబ్జా దారుల నుండి కాపాడాలన్నారు. సమావేశంలో డివైఎఫ్ఐ బద్వేల్ రూరల్ కార్యదర్శి బాల గురయ్య, ఉపాధ్యక్షులు జి.రమణయ్య, పట్టణ ఉపాధ్యక్షులు ఆంజనేయులు, ట్రెజరర్ సురేంద్ర పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి : ఎంపీ

ప్రజాశక్తి - బద్వేలు : స్థానిక పట్టణంలోని పోరుమామిళ్ల బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మించిన బంగారు సీనయ్య హాస్పిటల్ను బుధవారం కడప పార్లమెంటు సభ్యులు అవినాష్రెడ్డి, ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, పేద మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండేట ట్లుగా చూడాలని హాస్పిటల్ వ్యవస్థాపకులు బంగారు సీనయ్య, హాస్పిటల్ వైద్యు లు డాక్టర్ రాహుల్ను కోరారు. కార్యక్రమంలో నగర కార్పొరేషన్ చైర్మన్ గాను గపెంట రమణమ్మ, కుడా చైర్మన్ గురుమోహన్, మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాల స్వామి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నాగం సుబ్బారెడ్డి, వార్డ్ కౌన్సిలర్ చెవుల వెంకటేశ్వర్లు, వైసిపి నాయకులు ఈగ యద్దారెడ్డి, సుందర రామిరెడ్డి, డాక్టర్ మునెయ్య, సింగమల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప : కేంద్ర ఎన్నికల సంఘం నియమ నిబంధనలకు లోబడి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.విజయ్ రామరాజు రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో సాధారణ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై జెసి గణేష్ కుమార్, కడప నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, డిఆర్ఒ గంగాధర్ గౌడ్లతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కేంద్ర ఎన్నికల సంఘం నియమ నిబంధనల ప్రకారం ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహక రించాలని సూచించారు. అన్ని నియోజకవర్గాల్లో ఆర్ఒలు, ఎఆర్ఒలు తమకు సంబంధించిన విధులను సిబ్బందితో సమన్వయంతో వ్యవహరించి ఎన్నికల విధుల్లో ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా నిర్వహించాలన్నారు. అనంతరం ఇవిఎం గోడౌన్లను కలెక్టర్ వి.విజయ్ రామరాజు గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. భద్రతా చర్యలను ఆరా తీవారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు బి.హరి ప్రసాద్ (టిడిపి), జి.చంద్రశేఖర్ (సిపిఎం), కానుగ దానం (బిఎస్పి), జి.లక్ష్మణ్రావు (బిజెపి), ప్రసాద్గౌడ్ (కాంగ్రెస్), ఎం.మల్లికార్జున (వైసిపి), డాక్టర్ బి.శ్రీనివాసులు (ఆప్) పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో 9 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-కడప అర్బన్ : కెఎస్ఆర్ఎం మేనేజ్మెంట్ స్టడీస్, కెఎల్ఎం మహిళా కళాశాలలో ఎంబిఎ చివరి సంవత్సరం చదువుతూ 2024 లో ఉత్తీర్ణులయ్యే విద్యార్థులు ప్రాంగణ ఎంపికల్లో ప్రతిభ చాటారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.నాగమణి తెలిపారు. ప్రముఖ బహుళ జాతీయ సంస్థ అయిన డేమియం రీసెర్చ్ (పూణే) కంపెనీ వారు బుధవారం నిర్వహించిన ఈ ప్రాంగణ ఎంపికలలో 9 మంది విద్యార్థులు ఎంపికయ్యారని చెప్పారు. ఎంపికైన అయిన వారికి శిక్షణ కాలంలో ఏడాదికి రూ.2.52 లక్షల వేతనం వుంటుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ, వైస్ చైర్మన్ కందుల మదన్ మోహన్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పి.ప్రేమ్ కుమార్ అభినందించారు. కార్యక్రమంలో కె.ఎల్.ఎం మహిళా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.రత్న మ్మ, కళాశాల సీనియర్ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ అర్.నాగరాజు, హెచ్.ఆర్ ఎగ్జిక్యూటివ్ లీనా రాస్తాపూర్, ట్రైనింగ్ ఆండ్ ప్లేస్మెంట్ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

రంజాన్ వేళలు



ఇఫ్తార్	షహరీ
గురువారం (సా)	శుక్రవారం (ఉ)
6.30	5.03


మాట్లాడుతున్న తులసీశ్వర్ యాదవ్

వద్దిరాల కేంద్రంగా ఏటిఎం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మైలవరం మండలం వద్దిరాలలో ప్రజల సౌకర్యార్థం ఏటిఎం కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి నంద్యాల తులసీశ్వర్ యాదవ్ బ్యాంక్ అధికారులను కోరారు. జమ్మలమడుగులో ఆయన విలేక రులతో మాట్లాడుతూ మైలవరం మండలంలోని వద్దిరాల, దన్నవాడ, తల మంచిపట్నం, గొల్లపల్లి, జి.ఉప్పలపాడు గ్రామాలున్నాయని పేర్కొన్నారు. ఆయా గ్రామాల ప్రజలకు వద్దిరాల గ్రామ కేంద్రంగా ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మాత్రమే ఉందన్నారు. ఒక్క ఏటిఎం కేంద్రం కూడా లేకపోవడంతో ప్రజ లు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఖాతాదారులు జమ్మలమడుగు వచ్చి నగదు డ్రా చేసుకుంటున్నారన్నారు. అత్యవసరం సమయంలో డబ్బులు డ్రా చేసుకోవాలంటే జమ్మలమడుగు ఇరవై కిలోమీటర్ల దూరం ఉందన్నారు. బ్యాంక్ అధికారులు సందించి ఏటిఎం కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతు న్నామన్నారు. సమావేశంలో డివైఎఫ్ఐ నాయకులు సూరి, రాఘవ, రాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్ర ప్రగతి : తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర ప్రగతి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు తీరని ద్రోహం చేసిందన్నారు. రాష్ట్రానికి అవసరమై ప్రత్యేకహోదా అమలు చేయలేదని విమర్శించారు. విభజన చట్టంలో సెక్షన్ 46 సబ్ సెక్షన్ 3 ప్రకారం కేంద్ర ప్రభుత్వం రాయలసీమకు, ఉత్తరాంధ్రకు ప్రత్యేక అభివృద్ధి అమలు చేయాలన్నారు. రూ.24350 కోట్లకుగానూ పిల్లికి బిచ్చం వేసినట్లు ఈ పదేళ్లల్లో కేవలం మోడీ ప్రభుత్వం కేవలం రూ.1050 కోట్ల మాత్రమే విడుదల చేసినట్లు చెప్పారు. కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కాలేదని విమర్శించారు. దుగ్గరాజపట్నం ఓడరేవు నిర్మాణం కాలేదన్నారు. పోలవరం ప్రాజెక్టు ప్రశ్నార్థకమైందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు తీరని ద్రోహం చేసిన బిజెపితో పొత్తు పెట్టుకోవడానికి రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు పాకులాడడం సిగ్గుచేటని చెప్పారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని తులసిరెడ్డి కోరారు.


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

వైభవంగా వెంకటేశ్వర స్వామి కల్యాణం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పంచాయతీ పరిధిలోని కోగటం రోడ్డులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థాన పదవ వార్షికోత్సవం, వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం బుధవారం వేలాది భక్తుల నడుమ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారి అభిషేకం, హోమం తర్వాత శ్రీదేవి భూదేవి వెంకటేశ్వర స్వామి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా వేద పండితులచే ఘనంగా జరిపించారు. పట్టణ, చుట్టు ప్రక్కల గ్రామాల నుండి వేలాదిగా భక్తులు హాజరై కల్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం దాతల సహకారంతో అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం పట్టణ ప్రధాన రహదారుల వెంబడి గ్రామోత్సవం నిర్వహించారు. ప్రదర్శించిన కోలాటం ప్రజలను ఆకట్టుకుంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దేవస్థాన కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని గోపులాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారాముల దేవస్థానంలో బుధవారం సీతారాముల విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి గ్రామ ప్రజలతోపాటు పరిసర గ్రామ ప్రజలు కూడా భారీగా పాల్గొన్నారు. వేద పండితులు విగ్రహ ప్రతిష్టలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమం అనంతరం గ్రామ ప్రజల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు. జమ్మలమడుగు టిడిపి ఇన్చార్జ్ భూపేష్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట టిడిపి మండల అధ్యక్షులు మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నల్లపురెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, ఎరుకలయ్య, శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.

కడప ఎంపీ స్థానం మైనార్టీలకు ఇవ్వాలి

ప్రజాశక్తి - వేంపల్లె

కడప పార్లమెంటు టిడిపి సీటు ముస్లిం మైనార్టీ అభ్యర్థికి ప్రకటించాలని ఇడుపులపాయ యూనిట్ సభ్యులు పోతిరెడ్డి శివ, జబిబుల్లా, తొగటవీర క్షత్రియ సంఘం కార్యదర్శి మడక శ్రీనివాసులు కోరరు. బుధవారం వేంపల్లెలో వారు విలేకరులతో మాట్లాడుతూ కడప పార్లమెంటు టిడిపి సీటు మైనార్టీలకు ఇస్తే జిల్లా వ్యాప్తంగా ఉన్న మైనార్టీలు అందరూ ఓటు వేస్తారని చెప్పారు. మైనార్టీలకు సీటు కల్పిస్తే కడప పార్లమెంటు సీటుకు వేంపల్లెకు చెందిన సీనియర్ నాయకుడైన మహమ్మద్ షబ్బీర్ వలి కూడా అర్హుడని చెప్పారు. మహమ్మద్ షబ్బీర్ టిడిపి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఎన్టీఆర్ విగ్రహం ఎక్కడా లేనివిధంగా వేంపల్లెలో సొంత స్థలంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. టిడిపి అధినేత చంద్రబాబు మైనార్టీలకు కడప సీటు ఇచ్చేలా ఆలోచించాలని వారు కోరారు.

రైతు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - మైదుకూరు

మండలంలోని గడ్డంవారిపల్లి గ్రామానికి చెందిన రైతు కసెట్టి చంద్రాయుడు పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తండ్రి నుండి వారసత్వంగా వచ్చిన భూమిని అన్న నుండి కొనుగోలు చేసిన భూమికి పరిహారం ఎందుకు ఇవ్వరు అంటూ అధికారులను ప్రశ్నించారు. జాతీయ రహదారి అధికారులు నష్ట పరిహారం ఇవ్వలేదని పురుగుల మందు తాగాడు. తనకు నష్టపరిహారం ఇవ్వకుండా బలవంతంగా కోతకు వచ్చిన పంటను దున్నేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ, జాతీయ రహదారి అధికారులు సమాధానం చెప్పకపోవడంతో బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఉన్నత అధికారులు స్పందించి పరిహారం ఇప్పించాలన్నారు. లేకుంటే ఆత్మహత్యే శరణ్యం అని రైతు కన్నీరు పెట్టుకున్నాడు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - వల్లూరు

కడప-తాడిపత్రి జాతీయ రహదారి తప్పెట్ల గ్రామం వద్ద ద్విచక్ర వాహనం లారీని ఢీకొన్న సంఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బుధవారం పోలీసులు అందించిన వివరాల మేరకు.. ద్విచక్ర వాహనదారుడు లారీని ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడు అగ్రికల్చర్ అసి స్టెంట్ పవన్‌కుమార్‌గా గుర్తించారు. క్షతగాత్రుడు వల్లూరు మండలం దుగ్గా యపల్లిలో అగ్రికల్చర్ అసిసెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో రిమ్స్ వైద్యులు ఏలూరు హాస్పిటల్‌కు తీసుకెళ్లమన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తామన్నారు.

కుందూ పాత వంతెనకు కొరవడిన రక్షణ

ప్రజాశక్తి - చాపాడు

అల్లాడుపల్లె-సీతారామపురం గ్రామాల మధ్య కుందూనదిపై ఉన్న పాత వంతెనకు రక్షణ కరువైంది. వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కొంతమంది వంతెన పైనుండి అదుపు తప్పి నదిలోపడి ప్రాణాలను కోల్పోతున్నారు. గతేడాది అల్లాడుపల్లె గ్రామానికి చెందిన మహేష్ అనే వ్యక్తి స్కూటర్ అదుపుతప్పి నదిలో పడి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. గత వారంలో వంతెన మీద నుంచి ఒక యువకుడు కింద పడి గాయాలపాలయ్యాడు. వంతెనపై ఇరువైపులా రక్షణగా ఎలాంటి ఏర్పాటు లేదు. ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మెలు మాత్రమే ఉన్నాయి. ఇవి ఏమాత్రం ప్రయాణికులకు రక్షణ ఇవ్వడం లేదు. ఈ మార్గాన అల్లాడుపల్లె, చిన్న గురువలూరు, పెద్ద గురువలూరు, శ్రీరాముల పేట తదితర గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణిస్తుంటారు. ఆర్టీసీ బస్సుతో పాటు, ఆటోలు ఇతర వాహనాలు నిత్యం ప్రయాణిస్తుంటాయి. ఇప్పటికైనా వంతెనపై రక్షణగా ఏర్పాటు చేసి ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.


రక్షణలేని దిమ్మెలతో ఉన్న అల్లాడుపల్లె పాత వంతెన

సమావేశానికి అనుమతి లేదని అభ్యంతరం


వరద రాజులరెడ్డితో మాట్లాడుతున్న ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది హైమావతి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు కౌన్సిలర్ వైయస్ మహమ్మద్ గౌస్ స్వగృహంలో జరుగుతున్న సమావేశానికి అనుమతి ఉందాని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజురెడ్డిని ప్రశ్నించిన ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి హైమావతి. సమావేశానికి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని లేదంటే కేసు నమోదు చేస్తామన్నారు. టిడిపి అభ్యర్థి వరదరాల రెడ్డి సమాధానం ఇస్తూ తాము పబ్లిక్ ప్లేస్‌లో సమావేశం ఏర్పాటు చేయలేదని మా ఇంట్లో ఏర్పాటు చేసుకున్న సమావేశానికి పర్మిషన్ ఎందుకు తీసుకోవాలని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి హైమావతిని ప్రశ్నించారు. విషయాన్ని ఎన్నికల అధికారి దృష్టికి తీసుకెళ్లి వరదరాజులరెడ్డి, మహ్మద్‌గౌస్‌పై వన్‌టౌన్‌లో కేసు నమోదు చేసినట్లు హైమావతి తెలిపారు.

22వ వార్డులో పలువురు టిడిపిలో చేరిక

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి సమక్షంలో 22వ వార్డు వైసిపి కౌన్సిలర్ మహమ్మద్ గౌస్ ఆధ్వర్యంలో బుధవారం వార్డులోని పలువురు వైసిపి నుండి 200 మంది మైనారిటీలు టిడిపిలో చేరారు. స్థానిక కౌన్సిలర్ మహమ్మద్ గౌస్ ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వరద మాట్లాడుతూ హృదయపూర్వకంగా వైఎస్ మహమ్మద్ గౌస్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్నానన్నారు. టికెట్ రావటానికి కారణం ప్రొద్దుటూరు నియోజకవర్గ ప్రజలని, బలవంతుడికి టిడిపి టికెట్ కేటాయించిందన్నారు. ఇందులో ఏ సిపారస్సులు లేవన్నారు. అరాచక పాలన అంతం కావాలంటే టిడిపిని అధికారంలోకి తేవాలన్నారు. కౌన్సిలర్ మహమ్మద్ గౌస్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా వరద వెంట ఉన్నాం, వరద రాజకీయాలకి దూరంగా ఉండడంతో వైసిపిలో చేరామన్నారు. తామంతా కలిసి వరదను భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, వరద తనయుడు కొండారెడ్డి పాల్గొన్నారు.

'రెడ్యం'కు టిడిపి గురించి మాట్లాడే అర్హత లేదు : 'పుట్టా'

ప్రజాశక్తి - మైదుకూరు

42 ఏళ్ల టిడిపిలో ఉండి బయటికి వచ్చిన రెడ్యం వెంకటసుబ్బారెడ్డికి ఆ పార్టీ గురించి మాట్లాడే అర్హత లేదని మైదుకూరు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని శెట్టివారిపల్లెలో తెలుగుదేశం పార్టీలోకి మాజీ ఎంపీపీ మధుసూదన్ రెడ్డి చేరారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పుట్టా మాట్లాడుతూ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ఏనాడు ఖాజీపేట మండలంలో జరిగిన ఎన్నికలలో మెజారిటీ తీసుకురాలేదన్నారు. ఆయన ప్రత్యక్ష ఎన్నికలలో కూడా పోటీ చేయలేదన్నారు. ఆయనకు టిడిపి పార్టీ ప్రత్యేక గుర్తింపు ఇచ్చిందన్నారు. రెడ్యం వెంకటసుబ్బారెడ్డికి చంద్రబాబు గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. అనంతరం మున్సిపాలిటీ రెండో వార్డ్ కౌన్సిలర్ పోట్లదుర్తి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ కొప్పర్తి మధుసూదన్ రెడ్డి, పొలిమేర శివశంకర్ రెడ్డి తమ అనుచర వర్గంతో భారీగా వైసిపి నుండి టిడిపిలో చేరారు. పార్టీలో చేరిన వారికి సుముచిత స్థానం కల్పిస్తామని, తనకోసం కష్టపడిన వారికి తానెప్పుడూ అండగా ఉంటానని పుట్టా పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జి మల్లోత్రా, పట్టణ ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, గురివిరెడ్డి, బిఎల్ శ్రీనివాసులు, బిపి సుధా, శ్రీనివాసులు, మునెయ్య, కొండారెడ్డి, నరసింహులు, కటారి వీరన్న, జనసేన నాయకులు కృష్ణమూర్తి, రామచంద్ర నాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పుట్టా సుధాకర్ యాదవ్

ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాష్ట్రంలో పేద బడుగు బలహీన వర్గాలకు, మైనారిటీలకు మంచి జరగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిగా ఉండాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వేమగుంటపల్లి, కొత్త రోడ్డు గ్రామాలల్లో ఎన్నికల ప్రచారంలో తిరుగుతూ ఆయన ప్రతి ఒక్కరిని ఆత్మీయంగా పలకరిస్తూ జనంతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం చేసిన అభివృద్ధిని తెలియచేస్తూ ఎమ్మెల్యే అభ్యర్థిగా రెండవసారి జగనన్న అవకాశం కల్పించారని, మీకు మరింత సేవ చేయడానికి ముందుకు వచ్చానని తెలిపారు. ప్రతి ఒక్కరు తనకు, ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డికి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నేత మల్కిరెడ్డి హనుమంతురెడ్డి, అధికార ప్రతినిధి యోబు, కొట్టకుంటపల్లె శ్రీను, బొమ్మేపల్లి సర్పంచ్ రామనాథరెడ్డి, వేమగుంట పల్లె మధు నాయుడు, హరి, రమణ, పాటి నాయక్ పాల్గొన్నారు.

అల్లాడుపల్లె హుండీ ఆదాయం రూ.14.07 లక్షలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానం ఆవరణలో బుధవారం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని చేపట్టారు. దేవాదాయశాఖ పరిశీలకులు మారుతీ ప్రసాద్ పర్యవేక్షణలో లెక్కింపు ప్రారంభించారు. ఆలయ చైర్మన్ జివై వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్ జీఎం కిషోర్ కుమార్ రెడ్డి, ఈఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, సిబ్బంది లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. హుండీ ద్వారా రూ.14,07,724 ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు. గత ఏడాది కంటే రూ.1.93 లక్షలు ఆదాయం వచ్చిందని తెలిపారు. నగదును దేవస్థాన బ్యాంకు ఖాతాలో జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ సిబ్బంది, కమిటీ మెంబర్లు, అర్చకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


హుండీ కానుకలను లెక్కిస్తున్న కమిటీ సభ్యులు, దేవాదాయశాఖ సిబ్బంది


సిఇ గౌరీపతికి స్వాగతం పలుకుతున్న సోమశేఖర్‌రెడ్డి

ఆర్‌టిపిపి సిఇగా బాధ్యతలు చేపట్టిన గౌరీపతి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

డాక్టర్ ఎంవిఆర్ ఆర్‌టిపిపి నూతన సిఇగా గౌరీపతి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇఇఎఫ్ఎంఎస్ సిద్దయ్య, ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండర్ రాధాకృష్ణ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ రమేష్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించి, పరిపాలన భవన్ వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇన్‌ఛార్జి సిఇ సోమశేఖర్‌రెడ్డి, నూతన చీఫ్ ఇంజనీర్ గౌరీపతికి బాధ్యతలు అప్పజెప్పారు. బాధ్యతలు చేపట్టిన గౌరీపతిని పలువురు యూనియన్ నాయకులు కలిసి పుష్పగుచ్చాలు ఇచ్చి అభినందనలు తెలిపారు.


ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై నిలిచిపోయిన లారీ

తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు-జమ్మలమడుగు జాతీయ రహదారిలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై లారీకి తృటిలో ప్రమాదం తప్పింది. మైలవరం దాల్మియా సిమెంట్ కర్మాగారం నుండి సిమెంట్ లోడుతో బెంగళూరుకు వెళుతుండగా లారీ కింద ఉండే జాయింట్ ఊడిపోయి, ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై వెనక్కి వచ్చి రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఇనుప కంచెను ఆనుకుని నిలిచి పోయింది.

డిఎస్ఆర్ యువసేన ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వ ట్ట ణం లో ని సెంటెన్స్ పాఠశాల సమీపంలో పునీత జోజప్ప మహోత్సవాలకు హాజరైన భక్తులకు డిఎస్ఆర్ యువసేన అధ్యక్షుడు అరకటవేముల దేని ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదానం చాలా గొప్పదన్నారు.


అన్నదానం చేస్తున్న అరకటవేముల దేని


చలివేంద్రాన్ని ప్రారంభించిన కమిషనర్ రమణారెడ్డి

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని ప్రధాన రహదారిలో ఆపిల్ మెడికల్ దుకాణం, మానవత స్వచ్ఛంద ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల దాహార్తి తీర్చడం దేవుడు ఇచ్చిన గొప్ప వరమన్నారు. ఈ సందర్భంగా చలివేంద్రం ఏర్పాటు చేసిన వారిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవాసంస్థ చైర్మన్, కన్వీనరు, డైరెక్టర్లు, కార్యవర్గ సభ్యులు, మానవత సభ్యులు పాల్గొన్నారు.

పెద్దరికాన్ని గౌరవిస్తా : ఎమ్మెల్యే రాచమల్లు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వయసురీత్యా వచ్చే పెద్దరికాన్ని, అనుభవాన్ని తానెప్పుడూ గౌరవస్తానని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. వైసిపి అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి ఇంట్లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన రాజకీయ ప్రత్యర్థి అయిన టిడిపి అభ్యర్థి వరద రాజులరెడ్డి వయసును పదేపదే ప్రస్తావిస్తున్నందుకు బాధకలిగితే మన్నిం చాలన్నారు. మధ్య వయసులో ఉన్నప్పుడు చేయలేని ప్రొద్దుటూరు అభివృద్ధి వృద్ధాప్యంలో చేస్తారా అన్నది తన ప్రధాన ప్రశ్న అన్నారు. టిడిపి హయాంలో ప్రొద్దుటూరుకు చేసిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని రాచమల్లు కోరారు.

వడ్డీ మాఫీ లబ్ధి పొందేందుకు 10 రోజులే గడువు

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

పులివెందుల పురపాలక సంఘం పరిధిలోని ఆస్తి, ఖాళీ జాగా పన్ను చెల్లించేందుకు ఈనెల 31వరకు గడువు ఉందని కమిషనర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం వరకే వర్తిస్తుందన్నారు. ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సదరు ఆస్థి పన్ను బకాయిలను సంబంధిత వార్డు సచివాలయంలో కాని, ఆన్‌లైన్ (సిడిఎంఏ.ఏపీ.జిఓవి.ఇన్) ద్వారా కాని, పురపాలక సంఘ కార్యాలయపు ఖజానాలో సత్వరమే చెల్లించి రశీదు పొందాలన్నారు.

ఎర్రగుడిలో టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి -చక్రాయపేట

మండలంలోని ఎర్రగుడి గ్రామంలో టిడిపి మండల ఇన్‌ఛార్జి తాళ్లపల్లె మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పులివెందుల అభ్యర్థి బీటెక్ రవి సోదరుడు మారెడ్డి జోగిరెడ్డితోపాటు కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేశారు. ముద్దప్పగారి పల్లె, బీసీ కాలనీ, పెడమల వాండ్లపల్లి, ఎర్రగుడి, బిఎన్ తండా, గరుగు తాండాలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పుట్టా మహేష్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి - ఖాజీపేట

మైదుకూరు నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ తనయుడు, ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌తోపాటు రవికుమార్ యాదవ్‌కు బుధవారం కడప విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. మండలానికి చెందిన టిడిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. ఏలూరు పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించిన సందర్భంగా మొదటిసారి జిల్లాకు విచ్చేశారు. కార్యక్రమంలో ఇట్టేం శ్రీరాములు యాదవ్, టిడిపి మండల సీనియర్ నేత సందుల నాగశివారెడ్డి, గడ్డం జానకిరామ్ నాయుడు, మాచుపల్లె రమేష్ నాయుడు, రమేష్ నాయుడు, నరసింహ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన జియర్‌స్వామి

రాజారెడ్డి ఆశయాలను కొనసాగిస్తాం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఉన్నతమైన విలువలతో విద్యను అందించాలన్న రాజారెడ్డి ఆశయాన్ని కొనసాగిస్తామని శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన జియర్‌స్వామి తెలిపారు. రూరల్ పరిధిలోని చౌడూరు శ్రీపూజ ఇంటర్నేషనల్ స్కూల్లో రాజారెడ్డి సంస్కరణ, నూతన యాజమాన్య కమిటీ నియామక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన జియర్‌స్వామి మాట్లాడుతూ రాజరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యాసంస్థలను జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చూసుకుంటుందన్నారు ఇప్పటి నుండి స్వాధీనం చేసుకుంటుందన్నారు. 25ఏళ్ల క్రితం స్థానిక వ్యాపారవేత్త బుశెట్టి రామ్మోహన్ ద్వారా రాజారెడ్డితో పరిచయం ఏర్పడిందన్నారు. తాను నిర్వహించే రాజా ఫౌండేషన్‌ను సందర్శించాలని కోరారన్నారు. నువ్వే కొనసాగించు ఏదైనా అవసరమైతే తాను అండగా నిలబడతానని భరోసా ఇచ్చానన్నారు. రెండేళ్ల క్రితం అల్లంపల్లిలో కలిసి తిరిగి అదే మాట చెప్పారన్నారు. అనంతరం తాను అమెరికా పర్యటనలో ఉన్నప్పుడు రాజారెడ్డి మరణ దుర్వార్త వినాల్సి వచ్చిందన్నారు. అప్పటి కలెక్టర్ కృష్ణబాబు అభ్యర్థన మేరకు ట్రస్టును తీసుకున్నామన్నారు. తన అధీనంలోకి తీసుకు న్నామన్నారు. రాజారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎడ్యుకేషన్ విద్యాసంస్థలను జీయర్ ఎడ్యుకేషన్ సంస్థలకు ఇప్పుడు అనుసంధానం చేశామన్నారు. వ్యాపారకవేత్త బుశెట్టి రామ్మోహన్ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేశామన్నారు. సెక్రెటరీ గొర్రె శ్రీనివాసులు, ట్రెజరర్ విష్ణుచింతన్ స్వామి, సహాయ కార్యదర్శిగా కిరణ్మయిని ఎన్నుకున్నారు. రాజారెడ్డి కోరిన మేరకు ఈ విద్యాలయాన్ని ఎంతో ఉన్నతంగా నిర్వహిస్తామన్నారు.